సాక్షి
జగిత్యాల
ఆదివారం । 22 । డిసెంబర్ । 2024

వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ఇబ్రహీంపట్నం:ఏపీ మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సాఆర్ అభిమానులు మండలకేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ అభిమానులు రెబ్బటి రాజశేఖర్‌యాదవ్, గద్దం శేఖర్‌రెడ్డి, బద్దం వినయ్‌రెడ్డి, గూడ శ్రీకాంత్‌రెడ్డి, కంతి ప్రమోద్, దుదిగాం గంగాధర్, నోముల రంజిత్‌రెడ్డి, క్యాతం తిరుపతిరెడ్డి, తిపిరి అశోక్, స్వామి రెడ్డి తదితరులు ఉన్నారు.



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ అభిమానులు

న్యూస్‌రీల్

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా ఓంప్రకాష్



జగిత్యాలజోన్: అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా జగిత్యాల బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది ఓంప్రకాష్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. జగిత్యాల సబ్ కోర్టు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో ప్రభుత్వానికి సంబంధించిన సివిల్ కేసులు వాదించాల్సి ఉంటుంది. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డబ్బు లక్ష్మారెడ్డి, భూమి రమణకుమార్, న్యాయవాదులు ఓంప్రకాష్‌ను అభినందించారు.

ధ్యానంతో మానసిక ఆరోగ్యం



యోగా చేస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: సంపూర్ణ ఆరోగ్యానికి ధ్యానం, యోగా దోహదం చేస్తాయని, మానసిక, శారీరకంగా పట్టు సాధించవచ్చని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. యోగా దినోత్సవాన్ని పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నిత్యం బిజీబిజీగా ఉండే అధికారులు, సిబ్బంది నిత్యం ధ్యానం, యోగా చేయాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు సమర్థవంతమైన సేవలందించగలమన్నారు. ప్రతిరోజూ అరగంట పాటు యోగా చేస్తే అనారోగ్యం పాలుకాకుండా ఉండవచ్చని పేర్కొన్నారు. యోగా శిక్షకులతో కలిసి ధ్యానం, యోగా చేశారు. డీఎస్పీలు రఘుచందర్, రాములు, సీఐలు శ్రీనివాస్, రాంనర్సింహారెడ్డి, ఆరిఫ్అలీఖాన్, వేణుగోపాల్, ఆర్ఐ రామకృష్ణ, వేణు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రహరీ గ్యాప్‌ల మూసివేత



గ్యాప్‌ను సిమెంట్‌తో మూసివేసిన సిబ్బంది

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులంలోని ప్రహరీ మధ్య ఉన్న గ్యాప్‌లను అధికారులు మూసివేయించారు. గోడల మధ్య రంధ్రాలతో పరిసరాల్లోకి పాములు వచ్చే అవకాశాలు ఉన్నాయని శనివారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెల్సిందే. స్పందించిన అధికారులు మొత్తం ఏడుచోట్ల గ్యాప్‌లు ఉన్నట్లు గుర్తించారు. వాటి మధ్యలో సిమెంట్‌తో ఫిల్లింగ్ చేయించి మూసివేయించారు. మిగతా చోట్ల గోడలకు ఉన్న చిన్నచిన్న రంధ్రాలను సైతం మూసివేయించారు.

సాక్షి స్పందన

కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు

జగిత్యాలరూరల్: జిల్లాలో నాలుగు కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సిఫారసు లేఖతో హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయంలో ప్రతిపాదనలను అందించారు. పెగడపల్లి మండలం బతికెపల్లి పరిధిలోని కొండన్నపల్లి, సారంగాపూర్ మండలం పోతారం పరిధిలోని గణేశ్‌పల్లి, రాయికల్ మండలం చింతలూరులోని బషీర్‌పల్లి, కథలాపూర్ మండలం కలికోట పరిధి జామనాయక్ తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సమర్పించారు.

పీహెచ్‌సీని పరిశీలించిన డీఎంహెచ్‌వో



రికార్డులు పరిశీలిస్తున్న ప్రమోద్ కుమార్

మల్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్ శనివారం పరిశీలించారు. ఆస్పత్రి రికార్డులు, సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. మందుల నిల్వపై అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణలో నిర్మించిన భవనంలోని గదులను సందర్శించారు. వాటిని త్వరలో వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎన్.శ్రీనివాస్, వైద్యురాలు మౌనిక, స్టాఫ్‌నర్స్ రూప, ఫార్మసిస్టు సుభాష్, ల్యాబ్ టెక్నీషియన్ రాజేందర్, రాజ్‌కుమార్, విజయ పాల్గొన్నారు.

గణితంలో ఘనులు

సండే స్పెషల్



- నూతన ఆవిష్కరణల వైపు అడుగులు
- మ్యాథ్స్‌లో ప్రతిభ చాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- ఎగ్జిబిట్లతో అదరగొట్టిన స్టూడెంట్స్
- నేడు జాతీయ గణిత దినోత్సవం

గణితంలో ఎలాంటి లెక్కనైనా చటుక్కున తేల్చేస్తున్నారు. ఎక్కడ పోటీలు జరిగినా ప్రత్యేకత చాటుతున్నారు. టీచర్ల పర్యవేక్షణలో తర్ఫీదు పొందుతూ చకాచకా లెక్కలు చేసేస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం.. ఉపాధ్యాయుల సలహాలతో టాలెంట్ టెస్ట్.. మేథమెటిక్స్ ఒలింపియాడ్ పోటీల్లో ప్రతిభ చూపుతూ రాణిస్తున్నారు. పలువురు గణిత ఉపాధ్యాయులు సైతం సబ్జెక్టు బోధనలో వినూత్నంగా ఆలోచన చేస్తూ.. సరికొత్త పరిశోధనలు ఆవిష్కరిస్తున్నారు. నేడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని గణిత ఘనుల గురించి 'సాక్షి' స్పెషల్ స్టోరీ.!!

అర్బన్ ఎఫిషియెన్సీ టాయిలెట్స్



విద్యార్థి : అర్నా యుస్రా
పాఠశాల : సాయి మానేరు, కరీంనగర్
గైడ్ టీచర్ : వి.ప్రజ్ఞ
ఉపయోగించిన పరికరాలు : చార్ట్స్, మార్కర్స్, గమ్, గ్లూగన్, కార్డ్‌బోర్డ్, స్ట్రాలు, టీ కప్స్ తదితరాలు.
ఉపయోగం : జనసాంద్రత ఎక్కువగా ఉన్న నగరాల్లో తక్కువ స్థలంలో ఎక్కువ టాయిలెట్స్ నిర్మించి, ఉపయోగించుకోవచ్చు.
సాధించిన బహుమతి : జిల్లాస్థాయి సీనియర్స్ కేటగిరీలో ప్రథమ స్థానం.

త్రికోణమితి అనువర్తనాలు




విద్యార్థి : నల్గొండ రితిక
పాఠశాల : జెడ్పీహెచ్ఎస్, రామడుగు, కరీంనగర్
గైడ్ టీచర్ : సంగోజు శ్రీనివాస్
ఉపయోగించిన పరికరాలు : అట్టపెట్టె, డ్రాయింగ్ షీట్లు, లో కాస్ట్, నో కాస్ట్ మెటీరియల్.
ఉపయోగం : ఎత్తయిన భవనాలు, సెల్‌ఫోన్ టవర్లు, శిఖరాల ఎత్తును సులభంగా ఎలా కనుక్కోవచ్చో ఈ ప్రాజెక్టు ద్వారా చూపించారు.
సాధించిన బహుమతి : జిల్లా స్థాయి సీనియర్స్ కేటగిరీలో ద్వితీయ స్థానం.

సోలార్ పవర్ మల్టీ సేవ్ మెషిన్



విద్యార్థి : ఎం.చేగువేరా
పాఠశాల : పారమిత హెరిటేజ్, కరీంనగర్
గైడ్ టీచర్ : లలిత్‌మోహన్ సాహూ
ఉపయోగించిన పరికరాలు : ఐరన్, మోటార్స్, సోలార్ ప్యానల్, నెట్, ఫ్రేమ్, వైర్, వీల్స్ తదితరాలు.
ఉపయోగం : ఇది తక్కువ ఆదాయం ఉన్న ప్రజలకు ఉపయోగపడే ఒక వినూత్న సోలార్ బహుళ జల్లెడ యంత్రం. నిర్మాణ స్థలాలు, వ్యవసాయ పరిశోధనా కేంద్రాలు, భూసార పరీక్షా కేంద్రాల్లో నేల ధాన్యాలను వేరు చేయడానికి ఉపయోగపడుతుంది.
సాధించిన బహుమతి : జిల్లా స్థాయి జూనియర్స్ కేటగిరీలో ప్రథమ స్థానం.

రాష్ట్రస్థాయి సెమినార్‌లో గణిత ఉపాధ్యాయులు





సప్తగిరికాలనీ(కరీంనగర్): ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత టీచర్లలో సృజనాత్మకతను వెలికితీసేందుకు శనివారం హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్‌టీ ఆడిటోరియంలో స్టేట్ లెవెల్ మ్యాథమేటిక్స్ సెమినార్ నిర్వహించారు. దీనికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి అడిగొప్పుల సదయ్య, జెడ్పీహెచ్ఎస్ చింతకుంట(కరీంనగర్), సముద్రాల హరికృష్ణ, బాలికల ఉన్నత పాఠశాల మానకొండూర్ (కరీంనగర్), కాయితి అనిత, జెడ్పీహెచ్ఎస్ రామగుండం(పెద్దపల్లి), మంతెన వెంకటేశ్ బాబు, జెడ్పీహెచ్ఎస్ వెంకేపల్లి (కరీంనగర్), ఎర్రబెల్లి అశోక్, జెడ్పీహెచ్ఎస్ సుద్దపల్లి(జగిత్యాల) హాజరయ్యారు. పలు గణిత అంశాలపై పరిశోధన పత్రాలు సమర్పించారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఈవీ.నరసింహారెడ్డి చేతులమీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు.

సమగ్రంగా నేర్చుకోవాలి



కొత్తపల్లి(కరీంనగర్): గణితం లేని సమాజాన్ని ఊహించలేం. గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ చేసిన సేవలు అనిర్వచనీయం. గణితాన్ని సమగ్రంగా, విశ్లేషణాత్మకంగా నేర్చుకోవడం ద్వారా వివిధ రంగాల్లో విజయం సాధించవచ్చు. – వి.నరేందర్‌రెడ్డి, చైర్మన్, అల్ఫోర్స్ విద్యాసంస్థలు



రాష్ట్రస్థాయి సెమినార్‌లో ప్రశంసాపత్రం అందుకుంటున్న టీచర్ అనిత



రాష్ట్రస్థాయి సెమినార్‌కు హాజరైన ఉమ్మడి జిల్లా టీచర్లు

రాష్ట్రస్థాయి టెస్ట్‌లో రాణిస్తా



జ్యోతినగర్: తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. జిల్లాస్థాయి పోటీలో 30 ప్రశ్నలకు గాను 30 సమాధానాలు రాశాను. గైడ్ టీచర్ పేర్కారి శ్రీధర్‌రావు, ప్రధానోపాధ్యాయుడు గొర్రె జయరాజు, ఉపాధ్యాయురాలు కల్పన ప్రోత్సాహంతో రాష్ట్రస్థాయిలోనూ రాణిస్తాను.
– శనిగరపు ఎల్లైజా, పదోతరగతి, జెడ్పీహెచ్ఎస్ ఎన్టీపీసీ, రామగుండం

వేగం, కచ్చితత్వం కావాలి



జ్యోతినగర్(రామగుండం): విద్యార్థులకు మ్యాథ్స్‌లో ప్రతీ కాన్సెప్ట్‌పై పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తున్నాం. ఒకే ప్రశ్నను వివిధ రకాలుగా సాధించేందుకు బ్రెయిన్ స్టార్మింగ్, మైండ్ మ్యాపింగ్ పద్ధతులను వివరిస్తున్నాం. గణితానికి కావాల్సింది వేగం, కచ్చితత్వం.
– పేర్కారి శ్రీధర్‌రావు, గణిత టీచర్, జెడ్పీహెచ్ఎస్ ఎన్టీపీసీ, రామగుండం

టీచర్ల ప్రోత్సాహంతో రాష్ట్రస్థాయికి..



హుజూరాబాద్: మాది సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామం. నేను గొడిశాల జెడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి చదువుతున్నాను. జిల్లాస్థాయి గణిత పోటీల్లో ప్రతిభ కనబర్చి, హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. గణిత టీచర్లు సత్యనారాయణ, తిరుపతి, స్వర్ణలత ప్రోత్సాహంతోనే రాణిస్తున్నాను.
– బొల్లు రాము

మిషన్ మ్యాథమేటిక్స్



జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థినులతో టీచర్ ఫరీదుద్దీన్

ఇల్లంతకుంట(సిరిసిల్ల): గణితం అంటే విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి, సబ్జెక్టును ఇష్టంగా నేర్చుకోవడానికి మిషన్ మ్యాథమేటిక్స్ అనే కాన్సెప్ట్‌తో ఒక బృహత్తర కార్యక్రమం ఏర్పాటు చేశారు ఇల్లంతకుంట మండలం అనంతగిరి హైస్కూల్ మ్యాథ్స్ టీచర్ ఫరీదుద్దీన్. కరోనా సమయంలో పదోతరగతి విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ తయారు చేసి, పీడీఎఫ్ రూపంలో వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. రాష్ట్రంలోని మ్యాథ్స్ టీచర్లతో గ్రూపు నిర్వహిస్తున్నారు. భరోసా మ్యాథ్స్ విజార్డ్ సంస్థ నిర్వహించిన గణిత కాన్సెప్ట్ వీడియో కాంపిటీషన్‌లో ఈ పాఠశాల విద్యార్థులు రక్షిత, అక్షిత జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.


మూడు కోణాలు.. 180 డిగ్రీలు




రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టుతో శ్రీహిత, టీచర్ గంగాధర్

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలంలోని తక్కళ్లపెల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన మామిడి శ్రీహిత అనే పదోతరగతి విద్యార్థిని రూపొందించిన గణిత ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు ఎంపికైంది. మ్యాథ్స్ టీచర్ గంగాధర్ ఆధ్వర్యంలో త్రిభుజంలోని మూడు కోణాల మొత్తం 180 డిగ్రీలు, చతుర్భుజంలోని నాలుగు కోణాల మొత్తం 360 డిగ్రీలు అని కార్డ్‌బోర్డుతో సహాయంతో వివరించింది. ఈ ప్రాజెక్టు వచ్చే నెలలో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రదర్శించనున్నట్లు ఉపాధ్యాయుడు గంగాధర్ తెలిపారు.

వేద గణితం..





ముత్యంరెడ్డి వేద గణితం పుస్తక ముఖచిత్రం

సిరిసిల్ల కల్చరల్: సిరిసిల్లకు చెందిన మడుపు ముత్యంరెడ్డి 57 ఏళ్లుగా బోధన వృత్తికే పరిమితమై, గణితానికి జీవితాన్ని అంకితం చేశారు. 80 ఏళ్ల వయసులో సొంతంగా పాఠశాల నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. పూరీ పీఠాధిపతి శంకరాచార్యులు భారతీ కృష్ణ తీర్థ స్వామి ఆంగ్లంలో రాసిన వేదగణితాన్ని తెలుగులో రాశారు. 200 పేజీలున్న ఈ పుస్తకం హైస్కూల్ విద్యార్థులకు సంఖ్యా శాస్త్రంలో ఎదురయ్యే అంక గణిత పరికర్మలను దృష్టిలో పెట్టుకొని వేద గణిత సూత్రాలు, పద్ధతులను వివరించింది. ఇది ఎంతోమంది గణిత ఉపాధ్యాయులకు కరదీపికైంది. ముత్యంరెడ్డి ఇప్పటికీ ప్రత్యక్షంగా, ఉత్తరాల ద్వారా, సెల్‌ఫోన్ ద్వారా సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పక్కాగా చేయాలి

- కలెక్టర్ సత్య ప్రసాద్



ఇందిరమ్మ ఇళ్ల సర్వే తనిఖీ చేస్తున్న కలెక్టర్

పెగడపల్లి: ఇందిరమ్మ ఇళ్ల సర్వే పక్కగా చేపట్టి మొబైల్ యాప్‌లో అర్హుల వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. మండలకేంద్రంలో చేపడుతున్న సర్వేను డీపీవో రఘువరణ్‌తో కలిసి శనివారం పరిశీలించారు. రోజుకు ఎన్ని కుటుంబాలు సర్వే చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. గడువులోగా సర్వే పూర్తి చేయాలన్నారు. అనంతరం వైకుంఠధామం, డంపింగ్ యార్డు, కంపోస్ట్‌షెడ్లు, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. ప్రకృతి వనాల్లో పూలమొక్కలు, పండ్ల తోటలు పెంచాలని సూచించారు. కంపోస్టు షెడ్డులో తడిపొడి చెత్తను వేర్వేరు చేసి తయారైన ఎరువును వన నర్సరీల్లో మొక్కలకు వినియోగించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఆర్ఐ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, జ్యోతి ఉన్నారు.

పనిమనుషుల్లా క్రీడాకారులు..!

- విమర్శలకు తావిచ్చేలా సీఎం కప్ క్రీడల నిర్వహణ



స్విమ్మింగ్ పూల్ క్లీన్ చేస్తున్న క్రీడాకారులు

జగిత్యాలటౌన్: సీఎం కప్–2024 క్రీడల నిర్వహణలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద మినీ స్టేడియంలో హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులతో జిల్లా క్రీడల అధికారి కార్యాలయ సిబ్బంది స్విమ్మింగ్ పూల్ క్లీన్ చేయించడం వివాదాస్పదంగా మారింది. క్రీడల నిర్వహణ షెడ్యూల్ ముందే నిర్ణయించిన అధికారులు తీరా సమయం వరకు స్విమ్మింగ్ పూల్ క్లీన్ చేయించకపోవడం వారి నిర్లక్ష్యానికి పరాకాష్ఠగా నిలుస్తోంది. పైగా స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులకు గ్రీన్‌నెట్‌లు అప్పగించి స్విమ్మింగ్ పూల్ క్లీన్ చేయించడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని సిబ్బందిని ప్రశ్నించగా కార్యాలయానికి తాళం వేసుకుని వెళ్లిపోవడం విశేషం. డ్రాప్ అవుట్స్‌ను గుర్తించి విద్యాబోధన చేయాల్సిన అధికారులే క్రీడాకారులతో పనులు చేయించడంపై క్రీడాకారుల తల్లిదండ్రులు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా క్రీడల అధికారి రవికుమార్‌ను ప్రశ్నించగా.. వారు స్విమ్మర్లని, తాము వారికి పని చెప్పలేదని, వారికివారుగానే స్విమ్మింగ్ పూల్‌లోకి దిగారని స్విమ్మింగ్ పూల్‌లో చెత్త నిండి ఉండటంతో వారే క్లీన్ చేశారంటూ పొంతన లేని సమాధానం చెప్పడం గమనార్హం. క్రీడాకారుకు గ్రీన్ నెట్లు ఎవరిచ్చారని ప్రశ్నించగా.. సమాధానం దాటవేశారు. డీఈవోను వివరణ కోరగా.. విషయం తన దృష్టికి రాలేదని, సంబంధిత అధికారి నుంచి వివరాలు తెలుసుకుంటాననడం గమనార్హం.

పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి



ధర్మపురిలో విద్యార్థులు వండిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న డీఈవో

ధర్మపురి: విద్యార్థుల చదువులపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఈవో రాము అన్నారు. తెలంగాణ ఆహారోత్సవంలో భాగంగా ధర్మపురిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. పది పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున విద్యార్థులను చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, చక్కగా చదివి వందశాతం ఫలితాలు సాధించాలని కోరారు. అంతకముందు ఇళ్ల నుంచి విద్యార్థులు స్వయంగా వండి తెచ్చిన ఆహార పదార్థాలను రుచి చూశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సమతుల ఆహారాన్ని అందించాలని, అప్పుడే విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుంటారని సూచించారు. అనంతరం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయుడు గొల్లపల్లి గణేశ్ విజ్ఞప్తి మేరకు హైదరాబాద్‌కు చెందిన దయానందరెడ్డి రూ.30 విలువైన పుస్తకాలు, బీరువాను అందించారు. దాతలను డీఈవో అభినందించారు. ఎంఈవో సీతామహాలక్ష్మి, హెచ్ఎం పెండాల మహేందర్, కొలిచాల శ్రీనివాస్ ఉన్నారు.

రోడ్డుపైనే ఎస్ఎస్ఏల పాఠాలు



రోడ్డు మీదే పాఠాలు చెబుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

జగిత్యాలటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు శనివారం వినూత్నరీతిలో నిరసన తెలిపారు. రోడ్డుపైనే పాఠాలు బోధించారు. ఏళ్ల తరబడి అరకొర వేతనాలతో పనిచేస్తున్న తమ సర్వీసును క్రమబద్ధీకరించి విద్యాశాఖలో విలీనం చేయాలని కోరారు. వీరికి ఎమ్మెల్సీ అభ్యర్థి సీపీఎస్.కృష్ణారావు మద్దతు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు బర్ల రాజు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



వివరాలు తెలుసుకుంటున్న మేజిస్ట్రేట్

మెట్‌పల్లిరూరల్: విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్లక్ష్యం వహించొద్దని మెట్‌పల్లి మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్, సబ్‌కోర్టు మేజిస్ట్రేట్ నాగేశ్వర్‌రావు అన్నారు. మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను శనివారం సందర్శించా రు. ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు నిద్రించిన గదిలోకి వెళ్లారు. పడక మంచాలను గోడలకు ఆనించొద్దని, గదుల్లో ఎక్కడా గ్యాప్‌లు ఉండొద్దని సూచించారు. కిచెన్ స్టోర్ రూంలో వంట సామగ్రి, బాత్‌రూమ్స్, రిజిస్టర్‌ల నిర్వహణ తదితరాలను పరిశీలించారు. నాణ్యత లేని ఆహర పదార్థాలు, కూరగాయలు తిరిగి పంపించినట్లు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. విద్యార్థులు సమస్యలు తెలిపేందుకు ఫిర్యాదుల బాక్స్ పెట్టాలని పేర్కొన్నారు. గురుకులంలోని సమస్యలను జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీకి నివేదించనున్నట్లు వివరించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింబాద్రి, న్యాయవాదులు వెంకటనర్సయ్య, రాంభూపాల్, ప్రవీణ్, ప్రశాంత్, శేషు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గీత కార్మికుడి బలవన్మరణం


లింగస్వామి(ఫైల్)

రామడుగు(చొప్పదండి): వెదిర గ్రామానికి చెందిన గీత కార్మికుడు గుర్రం లింగస్వామి(75) అప్పుల బాధతోపాటు అనారోగ్యంతో బాధపడుతూ శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు రామడుగు పోలీసులు తెలిపారు. మృతుడికి కొడుకు, ముగ్గురు కూతుళ్లున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భూమి కోసం డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు

బోయినపల్లి(చొప్పదండి): గతంలో విక్రయించిన భూమికి మళ్లీ డబ్బులు డిమాండ్ చేస్తూ సాగుచేయకుండా ఇబ్బంది పెడుతున్న మండలంలోని దుండ్రపల్లికి చెందిన స్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ శనివారం తెలిపారు. దుండ్రపల్లికి చెందిన స్వామి, నర్సమ్మలు తమ పేరిట ఉన్న భూమిని 1997లో అదే గ్రామానికి చెందిన కొమురమ్మ, పోచమల్లులకు విక్రయించారు. అప్పటి ధర ప్రకారం భూమికి డబ్బులు చెల్లించారు. కొన్ని రోజుల తర్వాత స్వామి తాను భూమి విక్రయంచలేదంటూ కొమురమ్మ, పోచమల్లులను ఇబ్బందులకు గురిచేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నాడు. డబ్బులు ఇస్తేనే భూమి దున్ననిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. రెవెన్యూ అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తూ రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలియడంతో రూరల్ సీఐ శ్రీనివాస్ ఆదేశాలతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కొండగట్టు అంజన్న ప్రసాదం తూకంలో వ్యత్యాసం

- ఫిర్యాదు చేసిన భక్తుడు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న సన్నిధిలో లడ్డూ, పులిహోర ప్రసాదం తూకంలో వ్యత్యాసం వచ్చింది. శనివారం హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు స్వామివారిని దర్శించుకొని, 200 గ్రాముల పులిహోర కొనుగోలు చేశాడు. అనుమానం వచ్చి, సంబంధిత అధికారి ముందు తూకం వేయాలని కోరాడు. తూకం వేయగా పులిహోర బరువు 160 నుంచి 170 గ్రాములే ఉండటంతో అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఇదే విషయమై ఆలయ ఈవో రామకృష్ణారావును వివరణ కోరగా భక్తుడి ఫిర్యాదును పరిగణలోకి తీసుకొని, సంబంధిత ఇన్‌చార్జితో మాట్లాడతానని పేర్కొన్నారు.

ఇటుక బట్టీ కార్మికురాలి మృతి

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కదంబాపూర్ శివారులోని ఇటుక బట్టీలో ఓ కార్మికురాలు మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన దంపతులు ముకుందో గౌరి–లక్ష్మీగౌరి 15 రోజుల క్రితం కదంబాపూర్ ఎస్‌బీఐ ఇటుకబట్టీలో పనిలో చేరారు. లక్ష్మీగౌరి శనివారం పని ముగించుకొని, మధ్యాహ్నం స్నానం చేసేందుకు వెళ్లి, ప్రమాదవశాస్తు జారి పడింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్ర గాయమవగా, స్థానికులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

అడ్డం తిరిగిన సుపారీ

- ఓ వ్యక్తి హత్యకు ప్లాన్..?
- డబ్బులు ఇవ్వనందుకు బెదిరింపులు
- బెదిరించాడని హత్యకు పక్కా ప్లాన్
- పెట్రోల్ పోసి నిప్పంటించి మర్డర్
- నిందితులు ధర్మపురి వాసులు
- హతుడిది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం


సంఘటన స్థలం వద్ద గుమికూడిన గ్రామస్తులు, విచారణ చేపడుతున్న పోలీసులు

ధర్మపురి: ధర్మపురి మండలం నేరెళ్ల గుట్టల్లో గుర్తు తెలియని శవమంటూ కొద్దిరోజులుగా వినిపిస్తున్న వదంతులను పోలీసులు శనివారం ఛేదించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి ఓ యువకుడిని తీసుకొచ్చి దారుణంగా హత్య చేసి కాల్చివేశారని నిర్ధారించారు. పోలీసుల కథనం ప్రకారం.. నేరెళ్లకు చెందిన గోపాల్, ఇదే మండలం కమలాపూర్‌కు చెందిన గండికోట శేఖర్ స్నేహితులు. నేరెళ్లకు చెందిన మెరుగు లక్ష్మణ్ ముంబయిలోని ఓ బీచ్‌లో ఓ యువకుడిని చంపాలని గోపాల్‌ను ఫోన్‌లో సంప్రదించాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాహుల్ సూర్యప్రకాశ్‌సింగ్ ఉన్నాడని, ఎంత పెద్ద పనైనా చేసి పెడతాడని, అతడు ప్రస్తుతం ముంబయిలో ఉంటున్నాడని, ఈ విషయం మధ్యవర్తి తనకు తెలిసిందని గోపాల్ లక్ష్మణ్‌కు తెలిపాడు. సూర్యప్రకాశ్‌తో హత్య వివరాలను ఫోన్‌లోనే మాట్లాడి రూ.4 లక్షలకు సుపారి కుదుర్చుకున్నారు. కొద్దిరోజులకు సూర్యప్రకాశ్ డబ్బులు ఇవ్వాలని గోపాల్‌ను అడగగా.. ఎవరినీ హత్య చేయాల్సిన అవసరం లేదని, ఇదే విషయాన్ని లక్ష్మణ్ చెప్పాడని కూడా సూర్యప్రకాశ్‌కు వివరించాడు. అయితే సుపారి మాట్లాడుకున్నాక డబ్బులు తప్పకుండా ఇవ్వాల్సిందేనని, లేకుంటూ మీ తండ్రి రమేశ్‌ను చంపేస్తానని గోపాల్‌ను బెదిరించాడు.

సూర్యప్రకాశ్ హత్యకు పక్కా ప్రణాళిక

తన తండ్రినే చంపుతానంటాడా.. అని కక్ష పెంచుకున్న గోపాల్ సూర్యప్రకాశ్ హత్యకు పథకం వేశాడు. ఇందుకు కమలాపూర్‌కు చెందిన గండికోట శేఖర్‌ను కలిశాడు. ముంబయికి వస్తే డబ్బులిస్తామని నమ్మబలికారు. ఇద్దరూ కలిసి ఈనెల 12న ముంబయి వెళ్లి సూర్యప్రకాశ్‌ను దొరకబుచ్చుకున్నారు. అదే రోజు కారులో నేరెళ్లకు తీసుకొచ్చారు. ఈనెల 13న అర్ధరాత్రి నేరెళ్ల సాంబశివ ఆలయం వద్దకు తీసుకెళ్లి సూర్యప్రకాశ్ తలపై గోపాల్ బండరాయితో మోదాడు. చనిపోయాడని నిర్ధారించుకున్నాక.. శవాన్ని ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న సారంగాపూర్ మండలం బట్టపెల్లి, పోతారం వెళ్లే రహదారి మీదుగా అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి కట్టెల్లో పెట్టి పెట్రోలు పోసి దహనం చేశారు. ఇటీవల కొందరు అటవీప్రాంతానికి వెళ్లగా.. అక్కడ గుర్తు తెలియని వ్యక్తిని కాల్చివేసిన ఆనవాళ్లు కనిపించాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. గుర్తు తెలియని శవంగా భావించి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే నిందితులు శనివారం పోలీసులకు లొంగిపోయి హత్యకు సంబంధించిన వివరాలను పోలీసులకు వివరించారు. అన్ని కోణాల్లో విచారణ చేపట్టిన పోలీసులు గోపాల్ తోపాటు శేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు. హత్యకు గల కారణాలను మరింత లోతుగా విచారిస్తున్నట్లు వెల్లడించారు. సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్‌కుమార్ ఉన్నారు.

కోరుట్లకు చేరిన శ్రీరాముని స్వర్ణపాదుకలు


శ్రీరాముని స్వర్ణపాదుకలతో జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల: శ్రీరాముడు హిందువులందరికీ దేవుడని కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శ్రీరాముని స్వర్ణపాదుకల పల్లకీ యాత్ర శనివారం కోరుట్లకు చేరింది. ఈ సందర్భంగా పట్టణంలోని అష్టలక్ష్మీ సహిత లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో పల్లకీసేవ నిర్వహించారు. యాత్రికులకు నర్సింగరావు భిక్ష ఏర్పాటు చేయించారు. రామరాజ్య స్థాపనకు భాగ్యనగరం నుంచి ఈనెల 7న ప్రారంభమైన పల్లకీ పాదయాత్ర ఈనెల 30న అయోధ్యకు చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలు, మండలా అధ్యక్షులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, అంజిరెడ్డి, నాయకులు ఆకుల లింగారెడ్డి, కరుణాకర్ రావు, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి

- జాగ్రత్తలు తీసుకోవాలి
- డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్


నిర్వాహకులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న దృశ్యం

జగిత్యాల: జిల్లాలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, జీవన విధానం మార్చుకోవాలని, జాగ్రత్తలు తప్పనిసరి అని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్నారు. శనివారం ఐఎంఏ భవన్‌లో రోటరీ క్లబ్, ఆపి, ఐఎంఏ, ఒమేగా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, ఫుడ్, పొల్యూషన్ ద్వారా ఆహారపు అలవాట్లు, జంక్‌ఫుడ్ వల్ల క్యాన్సర్ వస్తుందని, ప్రజలు గ్రహించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్, మంచాల కృష్ణ పాల్గొన్నారు.

గల్ఫ్ ట్రావెల్స్ ఎదుట ఆందోళన


ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని కరీంనగర్ రోడ్‌లో గల ఓ గల్ఫ్ ట్రావెల్స్ ఎదుట మెట్‌పల్లికి చెందిన శివ అనే వ్యక్తి ఆందోళనకు దిగాడు. మెట్‌పల్లికి చెందిన శివ దుబాయ్ వెళ్లేందుకు కరీంనగర్‌రోడ్‌లోని ఓ గల్ఫ్ ట్రావెల్స్ యజమానికి మూడునెలల క్రితం పాస్‌పోర్టు అప్పగించాడు. వీసా రాకపోవడంతో పాస్‌పోర్ట్ కావాలని ట్రావెల్స్ నిర్వాహకులను శివ అడగగా.. రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు మెట్‌పల్లికి చెందిన ఎంఐఎం అధ్యక్షుడు అఖిల్, జగిత్యాల మున్సిపల్ కౌన్సిలర్ రజియోద్దీన్‌తో కలిసి ట్రావెల్స్‌కు చేరుకుని ఆందోళనకు దిగాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని బాధితులతో మాట్లాడారు. సోమవారం పాస్‌పోర్టు అప్పగిస్తామని గల్ఫ్ ట్రావెల్స్ నిర్వాహకులు చెప్పడంతో శాంతించి వెళ్లిపోయారు.

వ్యక్తి ఆత్మహత్య

ధర్మపురి: కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మనస్తాపానికి గురైన తండ్రి తాగుడుకు బానిసై.. మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ధర్మపురిలో చోటు చేసుకొంది. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురికి చెందిన మామిడి రాజన్న కుమారుడు గణేశ్ కొంతకాలం క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటినుంచి రాజన్న తాగుడుకు బానిసయ్యాడు. శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి పురుగుల మందు తాగి ఇంటికొచ్చాడు. కుటుంబ సభ్యులు వెంటనే ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా శనివారం మృతి చెందాడు. రాజన్న భార్య మంగ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళతో బాబా అసభ్య ప్రవర్తన

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని హనుమాన్‌వాడకు చెందిన ఓ మహిళపై లైంగికదాడికి యత్నించిన ఫకీర్‌బాబాపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన మహ్మద్ చాంద్‌మియా బాబా వేషంలో ఓ మహిళ ఇంటికి వెళ్లి తావీదులు కడతానని చెప్పి నమ్మించి.. అసభ్య ంగా ప్రవర్తిస్తూ.. అత్యాచారయత్నానికి పాల్పడ్డాడని బాధితురాలు పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేసింది. బాబాపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దొంగల ముఠాను గుర్తించిన పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్‌లో నాలుగు రోజుల క్రితం జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన మిట్టపల్లి జలజ బ్యాగులోని 28 తులాల బంగారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగలను గుర్తించారు. రెండు ప్రత్యేక బృందాలు నిజామాబాద్, ఆర్మూర్, మహారాష్ట్రలోని నాందేడ్, ఔరంగాబాద్, అకోలా ప్రాంతాల్లో ఆరా తీశాయి. త్వరలోనే నిందితులను పట్టుకునే అవకాశం ఉందని సమాచారం.

ఆయిల్ పాం సాగు పెంచాలి

జగిత్యాల: ఆయిల్ పాం సాగు పెంచేలా వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో వ్యవసాయాధికారులతో సమావేశమయ్యారు. క్లస్టర్ల వారీగా రైతులను మోటివేట్ చేస్తూ సాగును పెంచాలన్నారు. వానాకాలం సీజన్ క్రాప్ బుకింగ్ మండలాల వారీగా నమోదు చేయాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఈ కేవైసీకాని 2600 మంది రైతుల వివరాలను నమోదు చేయాలన్నారు. రైతుల ఆధార్‌కార్డు లింక్ కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏవోలు పాల్గొన్నారు.

రెండేళ్లు.. రూ.45 లక్షలు

- గుప్త నిధుల పేరిట భారీ వసూళ్లు
- కేసు నమోదు.. పరారీలో నిందితుడు

మల్యాల(చొప్పదండి): కొండగట్టు ప్రాంతంలో గుప్త నిధులు ఉన్నాయని, పూజలు చేసి వెలికితీసి, ఇస్తామంటూ రెండేళ్లుగా ఓ మహిళ నుంచి రూ.45 లక్షలు వసూలు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలోని కొండగట్టు ప్రాంతానికి చెందిన ఓ మహిళకు సూర్యాపేటకు చెందిన లింగానాయక్ పరిచయమయ్యాడు. తన పేరు చెప్పి, ఆధార్‌కార్డు చూపించి నమ్మించాడు. కొండగట్టు పరిసర ప్రాంతాల్లో గుప్త నిధులు ఉన్నాయని, డబ్బులు పెట్టి పూజలు చేయించుకుంటే, వెలికి తీసి ఇస్తానంటూ నమ్మబలికాడు. రెండేళ్లుగా వివిధ దఫాలుగా రూ.45లక్షలు వసూలు చేశాడు. గుప్త నిధులు ఉన్నాయంటూ ఇటీవల కొండగట్టు ప్రాంతంలో ఒక చోట తవ్వి కుండను బయటకు తీశాడు. దూరం నుంచి మహిళకు బంగారు బిల్లలు చూపించాడు. పూజ చేసిన అనంతరం ఇస్తామని చెప్పి వెళ్లిపోయాడని మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, పట్టుకునేందుకు గాలిస్తున్నామని ఎస్సై తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్


అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలక్రైం: జగిత్యాల మీదుగా వేర్వేరు చోట్ల నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం వివరాలు వెల్లడించారు. పట్టణ శివారులోని రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద పట్టణ ఎస్సై గీత ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టగా.. శివాజీనగర్‌కు చెందిన కల్యాణం ఉదయ్ ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. అతని నుంచి కిలో గంజాయి, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని ఉదయ్ ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మాడవి జనక్‌రావు వద్ద కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. అలాగే పట్టణ ఎస్సై మన్మథరావు ఆధ్వర్యంలో తహసీల్ చౌరస్తా వద్ద తనిఖీలు చేపడుతుండగా.. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం పిప్పిరి గ్రామానికి చెందిన మాడవి జనక్‌రావు పట్టుబడ్డాడని పేర్కొన్నారు. ఆయన నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వేణుగోపాల్, ఎస్సైలు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధంతోనే హత్య

- ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి
- నిందితుడి రిమాండ్


అరెస్టు చూపుతున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

వేములవాడ: వివాహేతర సంబంధంతోనే రషీద్ హత్య జరిగిందని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి తెలిపారు. హత్య చేసి పరారీలో ఉన్న నిందితుడిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వేములవాడరూరల్ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వేములవాడలో నివసించే మనోహర్ జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్తున్నాడు. ఈక్రమంలో పట్టణంలో నివసించే మహ్మద్ రషీద్(35)కు మనోహర్ భార్యతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయంలో ఇరు కుటుంబాల మధ్య పంచాయితీలు జరిగాయి. అయినా వారిద్దరిలో మార్పు రాకపోగా.. మనోహర్ భార్య పట్టణంలోని మరో ఇంట్లో ఉంటుంది. దీన్ని భరించలేకపోయిన మనోహర్ 45 రోజుల క్రితమే దుబాయ్ నుంచి ఇండియా కొచ్చాడు. ఈనెల 18వ తేదీ తెల్లవారుజామున ఇంట్లో నుంచి బయటకొచ్చిన రషీద్‌ను కత్తితో పొడిచి చంపి, పరారయ్యాడు. మల్లారం రోడ్డు ప్రాంతంలో శనివారం మనోహర్‌ను అరెస్ట్ చేసి, అతని నుంచి పాసుపోర్టు, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్, హత్యకు వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు మారుతి, రమేశ్ ఉన్నారు.

ప్రభుత్వ హామీని నిలబెట్టుకోవాలి


ఆందోళన చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

జగిత్యాలటౌన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాత పరీక్ష లేకుండా తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని రెండో ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు గాండ్ల మధురిమ డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం పట్టణంలోని కరీంనగర్ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమ ఆందోళనలను పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన మల్టీపర్పస్ ఫిమేల్ హెల్త్ అసిస్టెంట్ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ సేవలు, సీనియారిటీని దృష్టిలో ఉంచుకుని రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలని కోరారు. ఏఎన్‌ఎంలను సముదాయించిన పోలీసులు ఆందోళన విరమింపచేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మమత, జయప్రద, జిల్లాలోని పలువురు రెండో ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సిమ్స్‌కు పార్థివదేహం దానం

- నేత్రదానంతో ఇద్దరికి కంటి చూపు


మోహన్ (ఫైల్)


పార్థివ దేహానికి గౌరవ వందనం చేస్తున్న ప్రొఫెసర్, ఫౌండేషన్ ప్రతినిధులు, బంధువులు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని యైటింక్లయిన్‌కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి దాసారపు మోహన్(59) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన సభ్యులు మృతదేహాన్ని రామగుండం సింగరేణి మెడికల్ కాలేజీకి శనివారం దానం చేశారు. అంతకుముందు ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించడానికి, ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ ద్వారా మృతుని నేత్రాలు దానం చేశారు. సదాశయ ఫౌండేషన్, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పార్థివదేహాన్ని స్వీకరించిన సిమ్స్ అనాటమీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కల్పన, టెక్నీషియన్లు లక్ష్మణ్ కుమార్, సిద్ధార్థ, తిరుపతితోపాటు సిబ్బంది, మృతుని కుటుంబ సభ్యులు, సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు గౌరవ వందనం చేసి నివాళి అర్పించారు.

తల్లిదండ్రులను విస్మరిస్తే జైలుకే


కౌన్సిలింగ్ ఇస్తున్న ఆర్డీవో మధుసూదన్

జగిత్యాల: వయోవృద్ధులైన తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత పిలలదేనని, ఎవరైనా విస్మరిస్తే జైలుకెళ్లాల్సి ఉంటుందని ఆర్డీవో, ట్రిబ్యునల్ చైర్మన్ మధుసూదన్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో సెక్షన్ 2బీ, సెక్షన్ 4(1) కింద నమోదైన కేసులను విచారించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రుల పోషణ, వైద్య ఖర్చుల బాధ్యత కుమారులదేనని పేర్కొన్నారు. ఎవరైనా విస్మరిస్తే నేరుగా ఆర్డీవో కార్యాలయానికి రావచ్చని, న్యాయం చేస్తామన్నారు. పెగడపల్లి మండలం దీకొండ గ్రామానికి చెందిన వెంకటి, వెంకయ్యపల్లికి చెందిన సుగుణమ్మ, జగిత్యాలకు చెందిన బొల్లారపు నర్సమ్మ వారి కుమారులపై కేసు పెట్టారు. వారి కుమారులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో తఫజుల్ హుస్సేన్, హరి అశోక్‌కుమార్, విశ్వనాథం, ప్రకాశ్‌రావు, పద్మజ పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ నోడల్ అధికారిగా నారాయణ


నారాయణను సత్కరిస్తున్న అధ్యాపక బృందం

జగిత్యాల: ఇంటర్మీడియెట్ నోడల్ అధికారిగా నారాయణ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ పొందిన విషయం తెల్సిందే. కథలాపూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న నారాయణను నోడల్ ఆఫీసర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఆయనను జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో సత్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొట్టాల తిరుపతిరెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, రచన, శ్రీహరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గండిని తాత్కాలికంగా మరమ్మతు చేయాలి


కాలువ గండిని పరిశీలిస్తున్న ఎస్సారెస్పీ ఎస్‌ఈ శ్రీనివాస్ గుప్తా

ఇబ్రహీంపట్నం: కాకతీయ కాలువకు ఊటి వద్ద పడిన గండిని తాత్కాలికంగా మరమ్మతు చేసి పూడ్చివేయాలని ఎస్సారెస్పీ ఎస్‌ఈ శ్రీనివాసగుప్తా సిబ్బందిని ఆదేశించారు. మండలకేంద్రం శివారులోని కాకతీయ కాలువకు కొద్దిరోజుల క్రితం గండి పడిన విషయం తెల్సిందే. ఈనెల 25 నుంచి యాసంగి పంటల కు కాకతీయ కాలువకు నీటిని విడుదల చేయనున్నందున గండి ద్వారా నీరు వృథాగా పోకుండా తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని సూచించారు. అనంత రం డీ–24 కాలువ పైపు కల్వర్టులు ఉన్నచోట స్లాబులు వేసేందుకు.. సైడ్‌వాల్స్‌ల మరమ్మతు చేపట్టేందుకు, తూంల ఏర్పాటుకు రూ.68.40లక్షలు మంజురుకావడంతో ఇంజినీరింగ్ అధికారులు సర్వే చేసి అంచనాలు తయారు చేశారు. ఈ మేరకు పనులు చేపట్టేందుకు ఎస్‌ఈ పరిశీలించారు. ఆయన వెంట ఈఈ నారాయణరెడ్డి, డీఈ దేవనందం, ఏఈలు సాజీత్, సాయిచైతన్ పాల్గొన్నారు.

సర్కారు బడిలో ఉపాధ్యాయుల ఫొటోలు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు	511
ప్రాథమికోన్నత పాఠశాలలు	83
ఉన్నత పాఠశాలలు	189
మోడల్‌స్కూల్స్	13
కేజీబీవీ	16
రెసిడెన్షియల్ పాఠశాలలు	2
మొత్తం ఉపాధ్యాయులు	3100


అల్లీపూర్ హైస్కూల్

రాయికల్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల ఫొటో ఇక తప్పనిసరిగా ఫ్లెక్సీ రూపంలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మారుమూల గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు బదులు మరొకరు పాఠశాలలో బోధిస్తున్నారని విమర్శలు రావడంతో సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. ప్రతి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, గురుకులాలు, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ స్కూల్స్‌ల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఇక నుంచి తప్పనిసరిగా వారి ఫొటోలతో రూపొందించిన ఫ్లెక్సీ ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో 16 కేజీబీవీ, 511 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 83 ప్రాథమికోన్నత, 189 ఉన్నత పాఠశాలలు, 13 మోడల్ స్కూళ్లు, రెండు రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో సుమారు 3,100 మంది విద్యాబోధన చేస్తున్నారు.

ఉపాధ్యాయుల ఫొటో తప్పనిసరి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు, ఇటీవల నూతన ఉపాధ్యాయులు నియామకం కావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఒకరికి బదులు మరొకరు పనిచేయకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ జీవోను జారీ చేసింది. దీంతో అక్రమాలకు ఆస్కారం లేకుండా ఉంటుంది. మండలాలు, పట్టణాలకు దూర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో ఒకరు విధులకు హాజరవుతూ మరొకరు మేనేజ్ చేసే అవకాశానికి ఆస్కారం లేకుండా ఉంటుంది.

ఫొటో ఏర్పాటు తప్పనిసరి



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరిగా ఉపాధ్యాయుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని ఈనెల 7న డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా ఫొటోలు ఏర్పాటు చేయాలి. – రాము, డీఈవో